క్లుప్తంగా

చెంగాళమ్మ సేవలో జిల్లా జడ్జి



సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని నెల్లూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) యాక్ట్-కమ్-5 అదనపు సెషన్స్ జడ్జి ఎన్.సరస్వతి దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి బీ.ప్రసన్నలక్ష్మి సాదరంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయమర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని మంగానెల్లూరు పంచాయతీలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య పరీక్షలు శుక్రవారం నిర్వహించినట్టు పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.రమణయ్య తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో స్విమ్స్ శ్రీబాలాజీ ఆంకాలజీ ఆధ్వర్యంలో మహిళలు, పురుషులకు ఉచితంగా నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము మమోగ్రాం, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ శ్రీబాలాజీ ఆంకాలజీ వైద్యురాలు జి.హరిత తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాపూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణితం అధ్యపక పోస్టుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ వెంకటనాయక్ ఒక ప్రకటనలో కోరారు. ఏదైనా యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ గణితంలో 50 శాతం మార్కులు సాధించినవారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేలు పారితోషికం చెల్లిస్తామన్నారు. ఆసక్తి గలిగిన అభ్యర్థులు మూడు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 87901 88468లో సంప్రదించాలని కోరారు.

మోటార్ బైక్ బోల్తా.. యువకుడి మృతి

కోట: మండల పరిధిలోని చిట్టేడు వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి మోటార్ సైకిల్ బోల్తా పడిన ఘటనలో గణేష్(18) అనే యువకుడు మృతి చెందాడు. విద్యానగర్‌కు చెందిన గణేష్ చిట్టేడుకు వెళుతుండగా ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ పవన్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆరు మస్టర్ పాయింట్లలో కార్మికులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నెల 28న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. దారా కోటేశ్వరరావు, జోగి శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, పి.శ్రీనివాసులు, అల్లం శాంతివర్ధన్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

గూడూరు రూరల్: వృద్ధాశ్రమంలో వసతి పొందుతున్న వృద్ధులకు గూడూరు వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గురునాథం, మురళీనాయుడు, ప్రసాద్, ఎస్ఎల్ఎన్ స్వామి, గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం తగదు

నాయుడుపేట టౌన్: ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలకు వైద్యసేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ హెచ్చరించారు. నాయుడుపేట పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే నాయకులతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకళతో కలిసి వైద్యశాలలో అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో పరిస్థితులు చాలా అధ్వానంగా ఉన్నాయన్నారు. మొదటిసారి కాబట్టి వదిలేస్తున్నానని మరోసారి ఇలాగే ఉంటే ఉపేక్షించేబోమని హెచ్చరించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గంగ కాలువలో వివాహిత గల్లంతు

దక్కిలి: బట్టలు ఉతికేందుకు తెలుగుగంగ కాలువలోకి దిగిన ఓ వివాహిత ప్రమాదవశాత్తు కాలు జారడంతో కండలేరు-పూండి కాలువలో పడి గల్లంతైంది. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు దక్కిలి పంచాయతీలోని నరసనాయుడుపల్లి దళితవాడకు చెందిన కుంచం లక్ష్మీ(25) గ్రామ సమీపంలో ఉన్న తెలుగుగంగ కాలువలో బట్టలు ఉతికేందుకు వెళ్లింది. అక్కడ ప్రమాదవశాత్తు కాలు జారి గంగ కాలువలో పడి గల్లంతైంది. గల్లంతైన వివాహితకు భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులకు సమాచారం అందింది.

స్వర్ణముఖిని దోచేస్తున్నారు





గూడలి వద్ద స్వర్ణముఖిలో యథేచ్ఛగా యంత్రాలతో చేస్తున్న ఇసుక తవ్వకాలు, రీచ్ ఏర్పాటు చేసేందుకు గూడలిలో పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా(ఫైల్)

- ఉచితం పేరుతో రూ.2 వేలు వసూలు
- పగలు ట్రాక్టర్లు, రాత్రి పూట టిప్పర్లు
- చోద్యం చూస్తున్న అధికారులు

చిల్లకూరు: కోట మండలం గూడలి ప్రాంతంలో స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలో ఇసుకను తెలుగు తమ్ముళ్లు దోచేస్తున్నారు. ప్రతి రోజు పగలు పూట, ట్రాక్టర్లతో, రాత్రి సమయంలో టిప్పర్లతో ఇసుకను తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఇది తెలిసినా ఏ శాఖ అధికారి అటు వైపు కన్నెత్తి చూడక పోవడంతో పాటుగా తమ వాటా తమకు వస్తే చాలు అన్న చందాగా మిన్నకుండి పోతున్నారు. గూడూరు నియోజకవర్గంలోని ప్రజలకు ఇసుక అవసరాలను తీర్చేందుకు తీర ప్రాంతంలోని చిట్టమూరు మండలంలోని గునపాడు, గునపాటి పాళెం, కోట మండలంలోని గూడలి, పుచ్చలపల్లి, వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామాల వద్ద నుంచి ఇసుకను తరలించుకుంటారు. అయితే గత ప్రభుత్వంలో ఈ ప్రాంతాల్లో ఇసుకను తరలించే విధానానికి పూర్తిగా స్వస్తి పలికారు. నేడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇసుక పాలసీ విధానంలో ఉచితం అని ప్రకటించడంతో ఈ ప్రాంతాలలో ఇసుకను తవ్వి తరలించేందుకు తమ్ముళ్లు రంగం సిద్ధమయ్యారు. అంతే స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతాలలోని గూడలి ప్రాంతంలో యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టి కుళ్లబొడిచేస్తున్నారు.

టన్ను ఇసుక రూ.500

ఉచితం అని పేరుకే.... రీచ్ వద్దకు వెళ్లి ఒక ట్రాక్టర్ ఇసుక కావాలని అడిగితే నాలుగు టన్నులు వేసుకునే ఒక ట్రాక్టర్‌కుగాను రూ.2 వేలు చెల్లించాల్సిందేనని తమ్ముళ్లు చెబుతున్నారు. అయితే దీనికి ఎంత మేర వరకు లెక్కలు ఉన్నాయనే విషయాలు గాలికి వదిలేశారు. ఈ తవ్వకాలపై అధికారులు కూడా మీనమేషాలు లెక్కిస్తుండడంతో తమ్ముళ్ల పంట పండుతోంది. పగలు పూట ట్రాక్టర్‌తో రాత్రి సమయంలో టిప్పర్లతో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

గూడలి రీచ్‌పై వెనుకడగు

ఉచిత ఇసుక అని ప్రకటన చేసిన సమయంలో ఆయా ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌లను పరిశీలించి ఎక్కడ అనువుగా ఉంటుందో అక్కడ రీచ్‌లు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఈ క్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా స్వర్ణముఖినదీ పరివాహక ప్రాంతాలలో పరిశీలించిన రీచ్‌లలో అనువైనదిగా గూడలి రీచ్‌ను గుర్తించారు. అయితే ఏంజరిగిందో తెలియదు కానీ అక్కడ ప్రభుత్వం ద్వారా రీచ్‌ను ఏర్పాటు చేసే వీలులేకుండా పోయింది. దీంతో టీడీపీ నాయకులు రీచ్‌పై పెత్తనం దక్కించుకుని తమ ఇష్టానుసారంగా టన్ను ఇసుకకు రూ.500 చొప్పున వసూలు చేస్తూ అడిగిన వారికి కూలీల మేరకే నగదు తీసుకుంటున్నామని చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా, ఏ అధికారి అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నెల మామూళ్లతో సరి

ఇసుక తవ్వకాల విషయంలో అందురూ ఒక్కటే ఎవరితోనూ సంబంధం లేదు అని మాట మాత్రమే చెబుతుంటారు. అయితే తవ్వకాలు చేపట్టే టీడీపీ నాయకులు మాత్రం ఎవరి వాటా వారికి నెలకు ఒకసారి అందించడంతోనే అధికారులు మిన్నకుండి పోతున్నారని బహిరంగంగా చెబుతున్నారు. ఎవరి వాటా వారికి ఇస్తే ఎవరైనా ఇలా అక్రమ తవ్వకాలకు పాల్పడవచ్చా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కండలేరులో 40.299 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 40.299 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9400 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయి గంగ కాలువకు 600, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 10, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

న్యాయవాదుల ఆందోళన



నల్లబ్యాడ్జీలతో న్యాయవాదుల నిరసన

సూళ్లూరుపేట: న్యాయవాది కె.ధర్మాప్రసాద్‌పై అనుచితంగా ప్రవర్తించిన ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, అతనికి సహకరించిన సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట బార్ అసోసియేషన్ వారు శుక్రవారం విధులు బహిష్కరించి కోర్టు బయట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ కొన్ని తీర్మానాలు చేసిందిన తెలిపారు. తమ న్యాయవాదిపై అనుచితంగా ప్రవర్తించిన ఎస్‌ఐ, అతని సిబ్బందిపై ప్రైవేట్ కంప్లయింట్ ఇవ్వాలని నిర్ణయించారు. ఏపీ హైకోర్టులో వీరిపై పిటిషన్ దాఖలు చేసి కేసు ఫైల్ చేయడానికి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్‌లోని న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక బూటకం.. చంద్రబాబు నాటకం



నిరసన ర్యాలీలో పాల్గొన్న డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: ఉచిత ఇసుక బూటకం-చంద్రబాబు నాటకం అంటూ ప్లకార్డులు చేతపట్టుకుని మాజీ మంత్రి, వైఎస్ఆర్ సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులో జరిగిన నిరసన ర్యాలీలో డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కామిరెడ్డి మాట్లాడుతూ ఇసుక ఉచితం అంటూ చంద్రబాబు చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన ఉండదన్నారు. స్వర్ణముఖినదిలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతుంటే అరికట్టే నాథుడు ఒక్కరు కూడా లేరన్నారు. సూపరసిక్స్ పథకాలు గాలికొదిలి ప్రజలను దారి మళ్లించే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇసుక దోపిడీతో స్వర్ణముఖి నది ఎడారిగా మారిపోతుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చిల్లకూరు వడ్డిపాళెంలో హత్యకు గురైన వైఎస్ఆర్ సీపీ కార్యకర్త బండి చెంచయ్య కుటుంబానికి న్యాయం చేసే ప్రయత్నంలో భాగంగా హైకోర్టును ఆశ్రయిస్తున్నట్లు వివరించారు.

నిబంధనలు పాటించకుంటే తొలగించాలి

వాకాడు: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బ్రాందీ షాపులను వెంటనే తొలగించి, వాటి లైసెన్సులు రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌కి వినతిపత్రం అందజేశాడు. కోటేశ్వరరావు మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ ద్వారా కోట మండలానికి 7 షాపులు వచ్చాయన్నారు. అందులో కోట పట్టణంలో నాలుగు బ్రాందీ షాపులు నిబంధనలు ఉల్లంఘించి నిత్యం జనసంచారం ఉండే బస్ స్టాప్, ఆటో స్టాండ్, చిన్నపిల్లల హాస్పిటల్స్, బడులు ఉండే ప్రాంతాల్లో షాపులు నిర్వహిస్తుండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. అలాగే కోటలో బెల్టు దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయన్నారు. దీని వలన కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని తెలిపారు. అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న బ్రాందీ షాపులు, బెల్టు దుకాణాలు తొలగించి, వాటి లెసెన్సులను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పరిహారం ఇవ్వలేదని నిరసన



సాగరమాల రోడ్డు పనులు అడ్డుకున్న మన్నెగుంట రైతులు

చిల్లకూరు: భూ సేకరణ అనంతరం పట్టా భూములకు పరిహారం ఇవ్వకుండా ఆ భూముల్లో పనులు ఎలా చేశారంటూ రైతులు సాగరమాల రోడ్డు పనులను అడ్డుకున్నారు. శుక్రవారం తీర ప్రాంతంలోని మన్నెగుంట సమీపంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. భూ సేకరణ చేపట్టిన ప్రాంతంలో సాగరమాల రహదారి పనులు చేపట్టిన నిర్మాణ సంస్థ ప్రతినిధులు అక్కడ పనులు చేపట్టేందుకు సిద్ధం కావడంతో పరిహారం అందని రైతులు అక్కడికి చేరుకున్నారు. అయితే పరిహారం విషయంలో రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకోవాలని, తమ పనులకు ఆటంకం కల్పించవద్దని సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీంతో ఒక్కసారిగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా మన్నెగుంట గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ తీర ప్రాంతంలోని మన్నెగుంట గ్రామస్తులకు తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 346-1, 339-2, 327-3ఎలో ఐదు ఎకరాల పట్టా భూమిని కోస్టల్ కారిడార్‌లో భాగంగా సాగరమాల రహదారి కోసం సేకరించారన్నారు. అయితే ఆ భూములకు సంబంధించి ఇంత వరకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదని, కనీసం ఎంత పరిహారం ఇస్తారనే విషయం కూడా చెప్పలేదని తెలిపారు. తమకు పరిహారం ఇచ్చే వరకు ఎలాంటి పనులు చేయవద్దని సంస్థ ప్రతినిధులకు తెలియజేయడంతో వారు ఆ ప్రాంతంలో కాకుండా మరో చోట పనులు చేపట్టారు. అనంతరం పరిహారం అందని రైతులు గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాను కలసి పరిహారం అందించేలా చొరవ చూపాలని వినతి పత్రం అందించారు.

పశుగణన వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పశువైద్యులు

వాకాడు: దేశ వ్యాప్తంగా 21వ అఖిల భారత పశుగణన చేపట్టనున్నట్లు వాకాడు పశు వైద్యశాల ఏడీ రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం అఖిల భారత పశుగణన వాల్ పోస్టర్, స్టిక్కర్లను ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆవిష్కరించారు. ఏడీ రమణయ్య మాట్లాడుతూ ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి పశుగణన చేపడుతామన్నారు. ఈ పశుగణనతో మన పశు సంపద ఎంత ఉంది, ఎన్ని పశువులు ఉన్నాయనే విషయాలు పూర్తిగా తెలుస్తాయన్నారు. దీని ఆధారంగా అవసరమైన వ్యాక్సిన్ తయారు చేయడం, బడ్జెట్ కేటాయిస్తామన్నారు. 18 మంది సిబ్బందితో వాకాడు, చిట్టమూరు మండలాల్లో అన్ని రకాల పశువులు, కోళ్లు, కుక్కల సమాచారాన్ని సేకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మొలగనూరు వైద్యుడు కృష్ణారావు, సిబ్బంది ఉన్నారు.

గిరిజన కుటుంబానికి ఐటీడీఏ సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఐటీడీఏ అధికారులు

చిల్లకూరు: చిట్టమూరు మండలం కోగిలి గ్రామంలో రొయ్యల గుంతల వద్ద కాపలా ఉండి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన చెంచుక్రిష్ణయ్య కుటుంబానికి ఐటీడీఏ ఆధ్వర్యంలో సాయం అందించేలా రాష్ట్ర యానాదులు సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కృషి చేసారు. ఈ క్రమంలో శుక్రవారం గిరిజన కుటుంబం ఉంటున్న నరసింగారావుపేటలోని ఇంటి వద్ద ఐటీడీఏ అధికారులు రూ.10 వేల ఆర్థిక సాయం రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డివిజన్ ఏపీఓ రమణయ్య, ఎఫ్ఓ శ్రీనివాసులు, గూడూరు ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



అడ్వైజరీ కమిటీ సమావేశం

సూళ్లూరుపేట: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఈ చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి ఈతమాకుల కిరణ్మయి యాదవ్ హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుపై డివిజన్ స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేయడం ద్వారా భ్రూణ హత్యలను నివారించవచ్చునని తెలిపారు. ప్రతి నెలా అన్ని స్కానింగ్ సెంటర్‌లను డాక్టర్లు తనిఖీలు చేయాలని సూచించారు. స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్, రెన్యువల్, ఇతర మాడిఫికేషన్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తామని తెలిపారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ మార్చాలంటే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని సమాచారం తెలిసిన వారు 102, 104 టోల్‌ఫ్రీ నెంబర్లుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, గైనకాలజిస్టు డాక్టర్ లావణ్య, డీఈఎంఓ బాబు నెహ్రూరెడ్డి, లీగల్ మెంబర్స్, పోలీస్, ఎన్‌జీఓలతోపాటు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారమొస్తే కరివేపాకులమే...



బీజేపీ నాయకుడు పాదర్తి కోటారెడ్డి

కోట: టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు తమకు బాధ కలిగిస్తుందని బీజేపీ నేత, మాజీ గూడూరు నియోజకవర్గ కన్వీనర్ పాదర్తి కోటారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కోటలో అయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత తమను కరివేపాకులా తీసిపారేశారన్నారు. పేరుకే కూటమి ప్రభుత్వమని ఏ కార్యక్రమాలకు ఆహ్వానం లేదన్నారు. గూడూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులంతా అలాగే వ్యవహరిస్తున్నారన్నారు. చివరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్న పల్లెపండుగ కార్యక్రమాలకు కూడా బీజేపీ నాయకులకు ఆహ్వానం లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తమను గ్రామగ్రామాన తిప్పిన టీడీపీ నాయకులు ఇప్పుడు ఎదురొచ్చినా పలకరించడం లేదన్నారు. బీజేపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వెళ్లి టీడీపీకి ఓట్లేయమని అడగడం తప్ప చేసేది ఏమీ లేదన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న పనులు కూడా చేసుకోలేని పరిస్థితి ఉందన్నారు. అధిష్టానం దృష్టికి సమస్యను తీసుకెళ్తామని తెలిపారు.

కుట్టు ద్వారా ఆర్థికాభివృద్ధి

చిల్లకూరు: ఇంటి వద్ద ఉండే మహిళలు కుట్టు శిక్షణ నేర్చుకుని ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశాన్ని జిందాల్ పరిశ్రమ ద్వారా కల్పిస్తున్నట్లు పరిశ్రమ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు తెలిపారు. మండల తీర ప్రాంతంలోని తమ్మినపట్నం గ్రామంలోని జిందాల్, పవర్ పరిశ్రమ(సింహపురి యూనిట్) ఆధ్వర్యంలో శుక్రవారం తీర ప్రాంతంలోని పలు గ్రామాలకు చెందిన 40 మంది మహిళలకు కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలోని తమ్మినపట్నం, లింగవరం, మోమిడి గ్రామాలకు చెందిన 40 మంది మహిళలకు 45 రోజులపాటు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు విల్సన్, శ్రీకాంత్, ఎస్‌కే ఖలీద్, మ్యాథ్యూ, సీఎస్ఆర్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం



భట్లకనుపూరులో రీసర్వే గ్రామసభ

ఓజిలి: గ్రామీణ ప్రాంతాల్లో భూసమస్యల పరిష్కారానికి రీసర్వే ఓ చక్కటి వేదిక అని తహసీల్దార్ పద్మావతి అన్నారు. మండలంలోని భట్లకనుపూరు గ్రామంలో రీసర్వే గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పూర్తిస్థాయిలో రీసర్వే జరిగిందని సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వే నంబర్లు, ఎల్‌పీఎం నంబర్లలో మార్పులు చేర్పులు ఉంటే వీఆర్‌ఓకు వినతిపత్రం అందించాలన్నారు. రీసర్వేతో భూముల సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. అలాగే గ్రామంలోని మరి కొన్ని భూసమస్యలను గ్రామస్తులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. వీఆర్‌ఓ, సర్వేయర్లతో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ మస్తానయ్య, డీఎస్ హరోహర, సర్వేయర్ లక్ష్మీనారాయణ, నాయకులు జి.మధుసూదన్‌రెడ్డి, కె.గోపాల్‌రెడ్డి, బి.రవీందర్‌రెడ్డి, కె.ఫణీందర్‌రెడ్డి, కె.ఈశ్వర్‌రాజు, ఎస్.గురవయ్య పాల్గొన్నారు.

తప్పులు సరి చేసేందుకే గ్రామసభలు



గ్రామసభలో మాట్లాడుతున్న రీ సర్వే డీటీ చైతన్య

గూడూరు రూరల్: గతంలో చేపట్టిన రీ సర్వేలో తలెత్తిన చిన్నపాటి తప్పులు రి చేసేందుకే గ్రామ సభలను ఏర్పాటు చేస్తున్నట్లు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ చైతన్య తెలిపారు. రూరల్ పరిధిలోని ఎస్ఎస్ కండ్రిగలో శుక్రవారం రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి సెంటును గతంలో సర్వే చేశామన్నారు. అయితే ఈ ప్రాంతంలోని రైతులకు సర్వే సమయంలో హద్దుల మార్పులు, భూమి తగ్గి ఉండడం, పట్టాదారు పాస్ పుస్తకంలో పేర్లు మార్పులు తదితర సమస్యలు ఉంటే వాటిని గ్రామసభ ద్వారా అదికారులకు తెలియజేయాలని కోరారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం రైతుల నుంచి వచ్చిన సమస్యలను వినతిపత్రాల రూపంలో తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా రోడ్డు వేశారని ఫిర్యాదు

చిల్లకూరు: మండలంలోని బూదనం గ్రామంలో మేత పొరంబోకు స్థలంలో రోడ్డు నిర్మాణం, గ్రామానికి పైభాగంలో నిర్మిస్తున్న పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు శుక్రవారం ఈ మేరకు వినతి పత్రం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూదనం గ్రామంలోని సర్వే నెంబర్ 167-ఎ1, 167-ఎ2, 167-బిలలో నిర్మిస్తున్న పరిశ్రమ నుంచి కాలుష్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని అన్నారు. అలాగే ఈ పరిశ్రమకు వెళ్లేందుకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పంచాయతీకి చెందిన మేత పొరంబోకు స్థలంలో రోడ్డు నిర్మాణం చేపట్టారని అన్నారు. దీని వల్ల వర్షాల సమయంలో చెరువుకు నీరు వెళ్లే అవకాశం లేకుండా పోతుందని, దీనిపై విచారణ చేపట్టి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

జాతరకు పోటెత్తిన జనం

- అమ్మవారిని కనులారా తిలకించిన భక్తులు
- అత్యంత వైభవంగా ముగిసిన జాతర





కొలువుదీరిన అమ్మవారు, ఊరేగింపు

సైదాపురం: పోలేరమ్మ జాతర శుక్రవారం తెల్లవారుజామున భక్త జనసందోహం మధ్య అంగరంగ వైభవంగా ముగిసింది. మూడు రోజులపాటు జరిగే జాతరకు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తుల జయజయధ్వానాల మధ్య జాతర అట్టహాసంగా జరిగింది. సాగనంపు సమయంలో అమ్మవారిని దర్శించుకోవాలన్న తపన భక్తుల్లో కనిపించింది. అధిక సంఖ్యలో భక్తులు జాతరకు హాజరుకావడంతో సైదాపురం వీధులన్నీ జనసందోహంతో కిటకిటలాడాయి. గురువారం రాత్రి 1 గంటల వరకు నైవేద్య కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గ్రామ పొలిమేర వద్ద పొలి జరిగింది. అనంతరం ప్రారంభమైన పోలేరమ్మ సాగనంపు తూర్పు వీధి మీదుగా సాగింది. పిల్లలు, మహిళలు మిద్దెల మీదకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ముగిసింది. అనంతరం సాంప్రదాయంగా తూర్పువీధి సమీపంలో అమ్మవారి నిమజ్జనోత్సవం చేపట్టారు. పోలేరమ్మ మట్టిని తీసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు.

టీడీపీ విధానాలపై పోరాటాలకు సిద్ధం



కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసిన సంజీవయ్య, సత్యనారాయణరెడ్డి, సూళ్లూరుపేట నాయకులు

నాయుడుపేట టౌన్: టీడీపీ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలతో కలిసి పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. సంజీవయ్యతోపాటు ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నియోజవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, నాయకులతో శుక్రవారం నెల్లూరులో వైఎస్ఆర్ సీపీ చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాకాణికి శాలువాలు కప్పి పుష్ప గుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. వైఎస్ఆర్ సీపీ ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్‌రెడ్డి, ఎంపీపీలు ధనలక్ష్మీ, పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాషాభాయ్, ముస్లిం మైనారిటీ పట్టణ అధ్యక్షుడు షేక్ రహమతుల్లా రఘునాయుడు, దారా రవి, కావేరిపాకం అశోక్‌కుమార్, చిందేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల హర్షం

గూడూరు రూరల్: ఆలయాలలో బ్రాహ్మణులకు కమిటీ సభ్యులుగా అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై గూడూరు ఆదిశంకర బ్రాహ్మణ సేవాసంఘం తరపున సీనియర్ ఆడిటర్ శ్రీకంఠి రామోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. గూడూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని హిందూ సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందించేలా చర్యలు చేపట్టడం సంతోషకరమని అన్నారు. ఆయనతో పాటు సంస్థ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి నరేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.